# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 28 07 2025

సంపుటి 1 సంచిక 89

పేజీలు : 03

UDYAM / TS-09-0148996





# 'పౌల్ట్రీ'కి అండగా కాంగ్రెస్

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి – పెద్దఅంబర్ పేట్‌లో పౌల్ట్రీ ఫెడరేషన్ అడ్మినిస్ట్రేషన్ భవనం ప్రారంభం



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** పౌల్ట్రీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్‌లో తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అడ్మినిస్ట్రేషన్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో పాటు భారతదేశంలోని వివిధ ప్రాంతాల చెందిన పౌల్ట్రీ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. బిల్డింగ్ నిర్మాణం పౌల్ట్రీ రైతులకు చక్కటి వరం లాంటిదన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ కమర్షియల్ ఇండస్ట్రీ కాకుండా రైతుల పరిశ్రమగా భావించి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మున్ముందు పౌల్ట్రీ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. పౌల్ట్రీ పరిశ్రమ పితామహుడు బీవీ రావు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పౌల్ట్రీ రైతులకు విద్యుత్ సబ్సిడీ అలాగే హెచ్ఎండీఏ పరిధిలోని నిర్మించే షెడ్ల పర్మిషన్లు సంబంధించిన విషయాలను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని హామీనిచ్చారు. అలాగే పౌల్ట్రీ పరిశ్రమల సమస్యలను సీఎం దృష్టి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కాసర్ల మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర రావు, జక్క సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కాసిరెడ్డి నారాయణరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్, దలే సుధాకర్, గుర్రం చంద్రశేఖర్‌రెడ్డి, డా. దివ్యకుమార్ గులాటి మహారాష్ట్ర, రణపాల్ ధండా (హర్యానా), డా. జితేంద్ర వర్మ (కర్ణాటక), నవాబ్ అలీ అక్బర్ (ఉత్తరప్రదేశ్), శుభం బాలకృష్ణ మహలే (అమరావతి), రాజు నంబ్రాదర్ (ఢిల్లీ), మధుసూదన్‌రావు (తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్), కేవీ సుబ్బారావు (ఆంధ్రప్రదేశ్) తెలుగు రాష్ట్రాల పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు, వ్యాపారులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ టూర్ల ఖర్చు రూ.326 కోట్లు

2



## ఉయ్యాలవాడ గురుకులంలో ఫుడ్ పాయిజన్

జిల్లాలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పులే బాలికల గురుకుల పాఠశాలలో నిన్న రాత్రి ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. ఈ ఘటనలో ఏకంగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే .. శనివారం రాత్రి విద్యార్థినులకు స్నాక్స్‌గా పకోడి అందించారు. ఆ తర్వాత రాత్రి భోజనంలో క్యాబేజీ కూర వేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే సుమారు తొమ్మిది మంది విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే వారిని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఈ విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్ వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. అస్వస్థులైన విద్యార్థినులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు


**దశ, నాగర్‌కర్నూల్**



కుంట్లూరు గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలలో స్థానిక బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి రాష్ట్ర బి ఆర్ ఎస్ యూత్ నాయకులూ మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు . స్థానికులను ఆయన్ను ఘనంగా సన్మానించారు.
(దశ, పెద్ద అంబర్ పేట )

## అంగరంగ వైభవంగా బోనాల జాతర

**దశ, పెద్ద అంబర్ పేట :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుంట్లూరు గ్రామంలో ఆదివారం బోనాల జాతర అంగరంగ వైభవంగా జరగింది. గ్రామస్తుల అఖండ భక్తిశ్రద్ధల మధ్య కన్నుల పండువగా జరిగిన ఈ బోనాల పండుగ ఆడపడుచుల బోనాల తోరణాలతో మరింత వైభవాన్ని సంతరించుకుంది.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయ వేషధారణలో భక్తులు బోనెలు ఎత్తి ఊరేగింపుగా తీసుకెళ్లారు.



90వేలకు కొనుగోలు చేసి.. 40లక్షలకు అమ్మకం..

## సృష్టి మాయ




### సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో బిగ్ ట్విస్ట్.. రాజస్థాన్‌కు చెందిన బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు..

దశ, నాచారం : తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఐవీఎఫ్ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆదివారం మీడియా సమావేశంలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ భాగోతాలను ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ డీసీపీ రష్మీ పెరుమాళ్ బయట పెట్టారు.
ఈ నెల 25న సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై కేసు నమోదైంది. రాజస్థాన్‌కు చెందిన బాధితురాలు సోనియా ఫిర్యాదుతో కేసు నమోదు చేశాం. గతేడాది ఆగస్టులో డాక్టర్ నమ్రతాను సోనియా దంపతులు కలిశారు. ఐవీఎఫ్ ప్రొసీజర్ కోసం డాక్టర్ నమ్రతను సోనియా దంపతులు కలిశారు. ఇక్కడి నుంచి దంపతులను విశాఖకు పంపారు. ఐవీఎఫ్ ద్వారా

..మిగతా 2వ పేజీలో →

## సమాజాభివృద్ధి ప్రతి పౌరుని సామాజిక బాధ్యత

### 'హెచ్ ఎన్ ఎస్ చికిత్సాలయ్' ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**దశ, హైదరాబాద్:** సమాజాన్ని అభివృద్ధి చేయడం సమాజంలోని ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అందులో భాగంగా వివిధ వర్గాల సంఘాలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు ఎవరి శక్తి మేరకు వారు సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. హర్యాణా నాగరిక్ సంఘ్ (హెచ్.ఎన్.ఎస్ ) వారి సభ్యులతో పాటు పేదలకు కనీస చార్జీలతో వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సిక్ విల్లెజ్ లో హర్యాణా నాగరిక్ సంఘ్ (హెచ్ ఎన్.ఎస్) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్'ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, హెచ్.ఎన్.ఎస్ అధ్యక్షులు పదమ్ జైన్, సలహాదారులు రామ్ గోయల్, హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ అధ్యక్షులు

..మిగతా 2వ పేజీలో →

సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ వద్ద భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తల్లిదండ్రులు బూర రాజమ్మ , బూర లక్ష్మయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య , నల్గొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ పాల్గొన్నారు. విగ్రహాలకు పూలమాలలతో నివాళులు అర్పించి, గౌరవవందనాలు సమర్పించారు.
(దశ- సూర్యాపేట )



ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు దీపావళి శ్రవణ్ కుమార్, గుత్తా లక్ష్మణ్ రెడ్డి, గుజ్జ జగన్ మోహన్ రెడ్డి, యువ నాయకులు గెగ్గలపల్లి ఇంద్ర కరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.
(దశ, హయత్ నగర్ )





దశ
నిజం.. నిర్భయంగా..
02
సోమవారం
28-7-2025
WWW.
DASHANEWS
.COM



## డా.రాజమోహన్‌కు మాదిగ మేధావుల ఫోరం సన్మానం

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన డాక్టర్ బొరగాల రాజమోహన్, మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ గా పదోన్నతి పొందిన సందర్భంగా మాదిగ మేధావుల ఫోరం ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించింది. డాక్టర్ రాజమోహన్ వైద్య రంగంలో చేసిన కృషికి, అంకితభావానికి గుర్తింపుగా ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధులు వేల్పుల రత్నం, మట్టెడ ప్రకాష్, బోడిగే మల్లయ్య, బోరాగాల మొగిలి (టీపీటీ), మీదిదొడ్డి సంపత్, కనకం వెంకటస్వామి, ఎర్ర కుమార్, మరియు బోరగల సారయ్య తదితరులు డాక్టర్ రాజమోహన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. డాక్టర్ రాజమోహన్ వైద్య రంగానికి అందించిన సేవలను, అలాగే ఆయన సాధించిన ఈ ఉన్నత పదోన్నతిని వారు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ పదోన్నతి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజమోహన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఒక అభ్యర్థి ఒకే నామినేషన్!

**ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీకి పోటీ చేయటానికి నోచాన్స్..**


**కుటుంబంలోని ఓటర్లు అందరికీ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు**

**ఎంపీటీసీ కి గులాబీ, జడ్పీటీసీ ఎన్నికకు తెలుపు బ్యాలెట్ పేపర్లు**

**స్థానిక ఎన్నికల్లోనూ నోటా.. జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు**

**దశ, హైదరాబాద్:** గతంలో ఒక అభ్యర్థి అనేక పదవులకు పోటీచేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీపడాలనే నిబంధనను తీసుకురానున్నట్టు సమాచారం. ఒక అభ్యర్థి ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీచేసే అవకాశమూ ఈసారి ఉండబోదని తెలుస్తున్నది. ఇలా ఈసారి స్థానిక ఎన్నికల్లో అనేక కొత్త నిబంధనలను అమలు చేయనున్నారని తెలుస్తున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల చిక్కుముడి వీడకపోయినా, షెడ్యూల్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను విభజించారు. చనిపోయినవారి పేర్లను తొలగించి, కొత్తగా ఓటర్లను చేర్చి నూతన జాబితాను రూపొందించారు.

కొత్తగా నోటాను తీసుకొస్తున్నారు. 2004 నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మాత్రమే అమలులో ఉన్న నోటా ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ అమలు చేయనున్నారు. ఈ మేరకు బ్యాలెట్ పేపర్లలో నోటాను ముద్రించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నికల అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ఎంపీటీసీ పోలింగ్ కోసం గులాబీ, జడ్పీటీసీ ఎన్నిక కోసం తెలుపు రంగు బ్యాలెట్ల పేపర్లను సిద్ధం చేస్తున్నారు. గతంలో మండలం యూనిట్ తీసుకున్నందున ఒక కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉంటే కొన్నిసార్లు వారి ఓట్లు వేర్వేరు




పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండేవి. ఈసారి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నందున కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు వేసేలా చర్యలు తీసుకోనున్నారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఎన్నికల నాటికి కొత్త ఓటర్లకు చాన్స్:

ఎన్నికల నాటికి కొత్త ఓటర్ల చేరిక, ఉన్నవారిలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులను ఆహ్వానిస్తే వారి వివరాలతో వార్డుల వారీగా అనుబంధ జాబితానూ రూపొందిస్తారు. బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. గతంలో ఉన్న బ్యాలెట్లు, సీళ్లను పరిశీలించాలని ఇప్పటికే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశించారు. ఎంతమంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆర్వోలు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఏఆర్వోలు, పోలింగ్ సిబ్బంది అవసరమని గుర్తించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు నలుగురు అధికారులను నియమించనున్నారు.

### కలెక్టర్ల కు ఎస్ఈసీ ఆదేశాలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఈసీ,ఆదేశాలను జారీచేసింది. ఎన్నికల కోసం జిల్లా స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తాజాగా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులను జారీచేసింది. బ్యాలెట్ బ్యాక్సులు, పోలింగ్ సిబ్బంది, కావాల్సిన సామగ్రి, ఇతర సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నది.



# బోనమెత్తిన కుంట్లూరు

**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు .**

**దశ, పెద్ద అంబర్ పేట :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుంట్లూరు గ్రామంలో ఆదివారం బోనాల జాతర అంగరంగ వైభవంగా జరగింది. గ్రామస్తుల అఖండ భక్తిశ్రద్ధల మధ్య కన్నుల పండువగా జరిగిన ఈ బోనాల పండుగ ఆడపడుచుల బోనాల తోరణాలతో మరింత వైభవాన్ని సంతరించుకుంది.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయ వేషధారణలో భక్తులు బోనెలు ఎత్తి ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారినలుగు తాళ్లం, డప్పులు, పాటలతో ఊరేగింపు జరగగా, గ్రామ వీధులు సందడిగా మారాయి. స్థానిక యువకులు కళాత్మక ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులకు ప్రసాదాల పంపిణీ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత సంఘాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర వహించారు.బోనాల సందర్భంగా గ్రామమంతా ఉత్సవ శోభను సంతరించుకుంది. భక్తుల సందడి, సంగీత వాయిద్యాల గొంతుకలు, అమ్మవారికి చేసిన ఘనమైన అలంకరణలతో కుంట్లూరు గ్రామం ఆదివారం ఆధ్యాత్మిక రంగులో తులసి తోటగా మారింది. ఈ బోనాల ఉత్సవాలలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు .







**బోనాల ఉత్సవాల్లో భాగంగా మహిళా పోలీస్ ఉద్యోగులు ఆదివారం బోనాలతో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో సందడి చేశారు**

# డిబిఎల్ నిర్లక్ష్యంతో నీట మునిగిన పంట పొలాలు

**దశ, హుజూరాబాద్ :** కరీంనగర్ వరంగల్ మధ్య నిర్మిస్తున్న నేషనల్ హైవే మినహాయింపు రహదారి (బైపాస్ రోడ్డు) పనుల వల్ల హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రహదారి నిర్మాణ సమయంలో వర్షపు నీరు వెళ్లే మళ్లింపులు, కాల్వలను నిర్లక్ష్యంగా మూసివేయడంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటికే వర్షాలకు పంట నష్టపోయిన రైతులు, ఇప్పుడు నిర్మాణ పనుల కారణంగా మరోసారి నష్టపోతున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు. "ఏ విధమైన ముందస్తు సన్నాహాలు లేకుండా నిర్మాణం చేపడితే మా నష్టానికి బాధ్యులెవరు?" అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. రైతుల వివరాల ప్రకారం, ఈ సమస్యపై సంబంధిత శాఖ సూపర్వైజర్లను అడిగినప్పటికీ సరైన సమాధానం లభించలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని తగ్గించడానికి తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, వరద నీటి నిష్క్రమణకు తగిన ఏర్పాట్లు చేసి, తమ పంటలను రక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.





**పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి , ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, భువనగిరి పార్లమెంట్ బి ఆర్ ఎస్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, కల్లెం ప్రభాకర్ రెడ్డి తో కలిసి పాల్గొని స్థానిక నాయకులు , భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.**
**-(దశ, పెద్ద అంబర్ పేట )**



# సృష్టి మాయ

**మొదటి పేజీ తరువాయి**

సాధ్యం కాదు.. సరోగసితో అవుతుందని చెప్పారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికిందని చెప్పారు. ఐవీఎఫ్ ప్రొసీజర్ కోసం డాక్టర్ నమ్రత రూ.30లక్షలు డిమాండ్ చేశారు. రూ.15లక్షల చెక్కు,రూ. 15లక్షలు బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్. మెడికల్ టెస్టుల కోసం రూ.66వేలు తీసుకున్నారు. విజయవాడ వెళ్లి శాంపిల్స్ ఇచ్చారు.

వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి సరోగసి ద్వారా పుట్టిందని నమ్మించారు. ఢిల్లీకి చెందిన గర్భిణీని విశాఖ తీసుకొచ్చి డెలివరీ చేశారు. ఆ బిడ్డనే దంపతులకు ఇచ్చారు. ఢిల్లీలో డీఎన్ఏ టెస్ట్ చేయించారు. మరొకరి డీఎన్ఏ అని తేలింది. డాక్టర నమ్రత జాబితాలో చాలామంది డేటా ఉంది.

బిడ్డను ఇచ్చినందుకు ఢిల్లీ మహిళకు రూ.90వేలు ఇచ్చారు. దంపతుల వద్ద మొత్తం రూ.40లక్షలు వసూలు చేశారు. బాధిత కుటుంబం మమ్మల్ని కలిశారు. వెంటనే మేము సోదాలు చేశాము. నమ్రత కొడుకు జయంత్ కృష్ణ అడ్వకేట్‌గా పని చేస్తూ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై ఏదైనా కేసులు వస్తే తనే వాదించేవారు. వైజాగ్‌లోనూ సరోగసి ద్వారా అనేక గర్భధారణలు చేశారు నమ్రత. హైద్రాబాద్‌లో ఉన్న ఒక మహిళకు రూ.89వేలు ఇచ్చి ఫ్లైట్‌లో వైజాగ్ తీసుకెళ్లి అక్కడ సర్జరీ అయ్యాక పాపని వాళ్లకు అప్పగించి మళ్ళీ హైదరాబాద్‌కు పంపించారు. పేదలకు డబ్బు ఆశ చూపించి సరోగసీకి ఒప్పిస్తున్నారు నమ్రత. నమ్రతకు సంబంధించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ లైసెన్సులు కాన్సిల్ చేశాం. ఆమె లైసెన్స్ కూడా క్యాన్సిల్ అయ్యింది. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశాం. డాక్టర్ నమ్రతపై ఆంధ్రప్రదేశ్,తెలంగాణలలో 10కి పైగా కేసులు నమోదయ్యాయి.

### సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కథాకమామిషు ఏంటంటే?

పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య కేంద్రానికి వెళ్లిన మహిళకు భర్త శుక్ర కణాలతో కాకుండా వేరే వ్యక్తి శుక్ర కణాలతో సంతానం కలిగించిన ఘటన సికింద్రాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఇటీవల బాలుడి ఆరోగ్యంపై అనుమానంతో దంపతులు డీఎన్ఏ టెస్టు నిర్వహించగా ఈ విషయం బయటపడింది. దీంతో వారు రెజిమెంటల్ బజార్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటితో పాటు క్లూస్ టీం, వైద్య బృందాలు సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఓ జంట పెళ్లై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టక పోవడంతో రెండేళ్ల క్రితం సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. అక్కడ ఐవీఎఫ్ ప్రక్రియ అనంతరం వారికి మగబిడ్డ పుట్టాడు. అయితే ఇటీవల బాబు అనారోగ్యానికి గురికావడంతో వైద్యులను సంప్రదించారు. వివిధ రకాల పరీక్షల తర్వాత బాబుకు క్యాన్సర్ ఉందని తేలడంతో ఆ దంపతులు నిర్ఘాంతపోయారు. తమ తల్లిదండ్రులతో పాటు కుటుంబీకులు ఎవరికీ క్యాన్సర్ చరిత్ర లేకపోవడంతో, అనుమానం వచ్చి డాక్టర్ నమ్రతను గట్టిగా నిలదీశారు. ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో బాబుకు డీఎన్ఏ టెస్టులు చేయించగా.. ఆ దంపతుల డీఎన్ఏతో మ్యాచ్ కాలేదు. దీంతో డాక్టర్ నమ్రత తమను మోసం చేసిందని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలిసి పరారీలో ఉన్న డాక్టర్ నమ్రతను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విశాఖ కేసులో లైసెన్సు రద్దు చేసినా.. డాక్టర్ నమ్రత హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో సంతాన సాఫల్య కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం విశాఖపట్నంలో పేద మహిళలకు డబ్బు ఆశ చూపి సరోగసికి ఒప్పించి, పిల్లలు లేని వారి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. డాక్టర్ నమ్రతను పోలీసులు అరెస్టు చేయడంతో పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమె లైసెన్సును రద్దు చేసింది. దీంతో ప్రస్తుతం ఇక్కడ నడుస్తున్న టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఇతర డాక్టర్ల లైసెన్సుల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు తెలిసింది. కాగా కేపీహెచ్‌బీలోని టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో కూడా ఇలాగే అక్రమ సరోగసీ కేసు నమోదైంది.

# సమాజాభివృద్ధి ప్రతి పౌరుని సామాజిక...

**మొదటి పేజీ తరువాయి**

పురుషోత్తం అగర్వాల్, సికింద్రాబాద్ కంటోన్ బోర్డ్ సభ్యురాలు బి.నర్మద మల్లిఖార్జున్ తదితరులు ప్రసంగించారు. సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ సమాజం లేకుండా మనుషుల మనుగడ అసాధ్యమని, సమాజం శక్తివంతంగా ఉంటేనే ప్రజలు శక్తివంతంగా ఉంటారన్నారు. సమాజంలో అత్యవసరమైన వైద్య సేవలను అందించడంలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ లాంటి స్వచ్ఛంధ సేవా సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ మాట్లాడుతూ చికిత్సాలయ్ హెచ్.ఎన్.ఎస్ సోసైటీ సభ్యులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారికి కనీస చార్జీలతో వైద్య సేవలు, వైద్య పరీక్షలను అందించచనున్నట్లు ప్రకటించారు.

హెచ్.ఎన్.ఎస్ ఆసుపత్రిలో నిర్వహించే వైద్య పరీక్షలను కార్పొరేట్ ఆసుపత్రులు కూడా గుర్తించి ధృవీకరించే విధంగా, వివిధ రకాల ఉద్యోగులకు ఉండే బీమా కార్డుదారులకు కూడా అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ఒప్పందాలను కుదుర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ ప్రధాన కార్యదర్శి దీపక్ బింద్రాజ్ ఉపాధ్యక్షులు సుశీల్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి సందీప్ మిట్టల్, కోశాధికారి నారాయణ్ చౌదరి, హర్యాణా సేవా సంఘం అధ్యక్షులు రాజేందర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలు, ట్రస్టీలను గవర్నర్ ఘనంగా సత్కరించారు.

దశ
నిజం.. నిర్భయంగా..

03
సోమవారం
28-7-2025
WWW.DASHANEWS.COM

## హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై మరో కేసు నమోదు



**దశ హుజూరాబాద్ :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై మరో కేసు నమోదైనట్లు టౌన్ సీఐ కరుణాకర్ ఆదివారం వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 352, 353 (1)(బి), 352 (2) కింద కేసు నమోదు చేశారు. రాజకీయ విమర్శల పరిధి దాటి, ముఖ్యమంత్రిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఈ ఫిర్యాదుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కాగా, గతంలో కూడా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఒక వ్యాపారిని బెదిరించినందుకు కేసు నమోదైంది. ఆ కేసు ఇంకా మరువక ముందే, ఇప్పుడు హుజూరాబాద్‌లో మరో కేసు నమోదు కావడంతో ఇది రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక ప్రజాప్రతినిధిపై పదే పదే ఇలాంటి కేసులు నమోదు కావడం పట్ల వివిధ వర్గాల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కొత్త కేసుపై తదుపరి విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

# ఎంపీ రమేష్ ఫ్లెక్సీ దహనం చేసిన బిఆర్ఎస్ నాయకులు




- ❖ ఎంపీ రమేష్ కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- ❖ బి ఆర్ ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్

**దశ, రాజన్న సిరిసిల్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కేటీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, వెంటనే రమేష్ కేటీఆర్ కు క్షమాపణలు చెప్పాలని హెచ్చరించిన భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి ఆదివారం సీఎం రమేష్ ఫ్లెక్సీ దహనం చేశారు. అనంతరం రవి గౌడ్ మాట్లాడుతూ కేటీఆర్ ని ఏమైనా అంటే ఊరుకోమని, మీ పార్టీ ఎప్పుడూ మా తెలంగాణాకు వ్యతిరేకమని తెలంగాణకు నష్టం చేయాలని చూస్తారనీ అన్నారు. మీరూ కేటీఆర్ ని ఏమైనా అంటే మీకు రాజకీయ భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. తక్షణమే సీఎం రమేష్ మీ పార్టీ తరుపున కేటీఆర్ కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ పై మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. మీరు మీ పార్టీ తెలంగాణ కు ద్రోహుల పార్టీ అని ఇక్కడి ప్రజలకు తెలుసనని,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి టిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ సాధించిన మా తెలంగాణ ప్రాంతం అని గుర్తు చేశారు.మీ తెలంగాణలో పాగా వెయ్యాలని చూస్తున్నరనీ మీరు మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన మాట్లాడితే కేటీఆర్ అభిమానులుగా నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, ముద్దం అనిల్ గౌడ్, కోడం వెంకటేశం, ఎస్.కె అప్రోచ్, శ్రీనివాస్,హరీష్, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## జీ.పీ.ఓ, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**దశ, రాజన్న సిరిసిల్ల :** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం సిరిసిల్ల పట్టణం లోని గీతానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 39 మంది అభ్యర్థులకు గాను 35 మంది హాజరయ్యారని, నలుగురు గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 156 మంది అభ్యర్థులకు గాను 141 మంది హాజరయ్యారని 15 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. కాగా, లైసెన్స్డ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ లో జరిగే ప్లాటింగ్ పరీక్షకు 156 మంది అభ్యర్థులకు గాను 139 మంది హాజరయ్యారని 17 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏఓ రాంరెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## అన్నెపు నీలమ్మ 9వ వర్ధంతి ... అన్నదానం



**దశ, రాజేంద్రనగర్:** ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అన్నెపు ప్రభువు ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు అన్నారు. అన్నెపు నీలమ్మ 9వ. వర్ధంతి సందర్భంగా కుమారుడు అన్నెపు ప్రభు ముదిరాజ్ శంషాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో పేద పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డి శవయాత్ర, దిష్టిబొమ్మ దగ్ధం



**దశ, రాజేంద్రనగర్ :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ దగ్గర యూత్ కాంగ్రెస్ నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి శవయాత్ర దిష్టిబొమ్మ దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వాక్యాలను అనడం సరికాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల పరిపాలన కోసం నిరంతరం కష్టపడి వ్యక్తి టిఆర్ఎస్ పార్టీ ఓర్వక కౌశిక్ రెడ్డిని రెచ్చగొట్టి సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని అందించడం టిఆర్ఎస్ పార్టీకి టిఆర్ఎస్ నాయకులకు సరికాదని హెచ్చరించారు ఇలా మాట్లాడటంతో కౌశిక్ రెడ్డికి ఎన్నాడైనా శిక్ష పడుతుందని కనుక ఇప్పటికైనా ఇలాంటి చిల్లర రాజకీయాల్లో మాటలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో పాటు పార్టీ సీనియర్ నాయకులు కోటేశ్వర్ జిల్లా ఆనంద్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చాలి: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య

**దశ, ఎల్లారెడ్డిపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట,గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలలో ప్రభుత్వ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో రకాలైన పథకాలను అమలు చేస్తూ ఉంటే కార్యకర్తలు వాటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనదేనని అన్నారు.



మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ కింద మహిళా సంఘాలకు డబ్బులను ప్రభుత్వం మహిళా సంఘాల అకౌంట్లకు వేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా సంఘ సభ్యురాలు మరణిస్తే 2 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కులను కూడా అందిస్తున్నారని అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాలకు ఒక్కొక్క బస్సు చొప్పున అందించడానికి ప్రణాళికకు ఆమోదం జరిగిందన్నారు. సన్న బియ్యం పంపిణీ రేషన్ కార్డులు అందించడం ఒక బృహత్తర కార్యక్రమం అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఈ పథకాలను పేద ప్రజలందరికి చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మోడీ టూర్ ఖర్చు రూ.326 కోట్లు

- ❖ 2021-24 వరకు ఈ పర్యటనల కోసం రూ.295 కోట్లు

**దశ, న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ.. తనకు వచ్చిన బహుమతులను, జ్ఞాపికలను ఆన్‌లైన్‌లో వేలం వేసి వచ్చిన డబ్బులను స్వచ్ఛంద సంస్థలకు ఇస్తుంటారు. ఇందులో స్వదేశంలోని జ్ఞాపికలతోపాటు విదేశాలకు చెందిన జ్ఞాపికలు కూడా ఉంటాయి. ఇక మోదీకి ఆస్తులు కూడా పెద్దగా లేవు. కానీ, మోదీ విదేశీ పర్యటనకు చేస్తున్న ఖర్చు మాత్రం మామూలుగా లేదు. కేవలం 5 ఏళ్లలో రూ.326 కోట్లు ఖర్చు అయ్యాయి. ఇది ఎవరో చెప్పిన లెక్క కాదు.. స్వయంగా కేంద్రమే పార్లమెంటుకు సమర్పించింది. మోదీ సాధారణంగా విదేశీ పర్యటనలకు వెళ్లరు. ఆ దేశాల నుంచి ఆహ్వానం వస్తేనే వెళ్లారు. అయితే పహల్గాం ఉగ్రదాడి తర్వాత పలు దేశాలకు వెళ్తున్నారు. పలు దేశాలతో సత్సంబంధాలు, వ్యాపార, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. సైనిక, సాంకేతిక సహకారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మోదీ విదేశీ పర్యటన దేశ ఆర్థిక వ్యవస్థ, దౌత్య సంబంధాలు, అంతర్జాతీయ ఖ్యాతిని బలోపేతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ప్రకారం, 2021 నుంచి 2024 వరకు ఈ పర్యటనల కోసం రూ.295 కోట్లు ఖర్చయ్యాయని పేర్కొంది. 2025లో యూఎస్ఏ, ఫ్రాన్స్ సహా ఐదు దేశాల పర్యటనలకు రూ.67 కోట్లు అదనంగా ఖర్చు కాగా, మొత్తం ఖర్చు రూ.362 కోట్లకు చేరింది.కేంద్రం ఈ ఖర్చులను వెల్లడిస్తూ, కొన్ని పర్యటనల గురించి సమాచారం దాచడం గమనార్హం. మారిషస్, కెనడా, బ్రెజిల్ వంటి తొమ్మిది దేశాల పర్యటనల ఖర్చు వివరాలు బహిర్గతం కాలేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ బ్రియాన్ లేవనెత్తిన ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం ఇచ్చినప్పటికీ, ఈ అస్పష్టత పలు అనుమానాలకు



దారితీస్తోంది. ఈ ఖర్చులలో విమాన ఖర్చు, భద్రతా ఏర్పాట్లు, స్థానిక రవాణా, ఇతర లాజిస్టిక్స్ ఏ రీతిలో ఉన్నాయనే దానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం.ఐదేళ్లలో మోదీ విదేశీ పర్యటనకు రూ.362 కోట్లు ఖర్చు అయిన నేపథ్యంలో అందుకు తగిన ఫలితం భారత్‌కు దక్కిందా అన్నది కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. మోదీ పర్యటనలు భారతదేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు, వాణిజ్య ఒప్పందాలు, దౌత్య సంబంధాలలో బలాన్ని తెచ్చాయని బీజేపీ, ఎన్డీఏ నేతలు సమర్థించుకుంటున్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు భారతదేశ రక్షణ, సాంకేతిక, ఆర్థిక రంగాలలో ప్రయోజనాలను అందించాయి. అయితే, ఇంత భారీ ఖర్చు.. దేశంలోని ఆర్థిక సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటే, ప్రతి రూపాయి ఖర్చుకు లెక్కలు ఉండాలని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## నో పార్కింగ్ ఘటనలో లారీ డ్రైవర్లపై కేసు



**దశ, ఎల్బీనగర్:** ఆటో నగర్ లోని జాతీయ రహదారిపై లారీలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన లారీ డ్రైవర్లపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆదివారం తెల్లవారుజామున వనస్థలిపురం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోనగర్ నేషనల్ హైవే పైన అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే విధంగా కొందరు డ్రైవర్లు లారీలను జాతీయ రహదారిపై పార్కింగ్ చేశారు. ఈ ఘటనలో 12 మంది లారీ డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో లారీ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు పాటించాలని ఇన్ స్పెక్టర్ మహేశ్ గౌడ్ అవగాహన కల్పించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా లారీలను పార్కింగ్ చేయడంతో చాలా రోడ్డు ప్రమాదాలు జరిగి, అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, వికలాంగులు అయ్యారని గుర్తు చేశారు. రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయకూడదని హెచ్చరించారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.



## శ్రీ ప్రియాంక కూచిపూడి నృత్య ప్రదర్శన

**దశ, రాజేంద్ర నగర్:** హైదరాబాద్ అమీర్పేట్ లో గ్రీన్ ల్యాండ్ ఆడిటోరియంలో డాక్టర్ నిషిత యాబాజీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు అంగరంగ వైభవంగా చూడముచ్చటగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సింగపూర్ నుంచి వచ్చిన కూచిపూడి నృత్యాకారిణి ప్రియాంక అరంగేట్ర కూచిపూడి నృత్యాన్ని చూడముచ్చటగా చేసింది, సింగపూర్ ఇండియన్ ఫైల్స్ ఆర్ట్స్ సొసైటీలో గురువుగా డాక్టర్ నిషిత యాబాజి శశిరికంలో పది సంవత్సరాలు తరబడి కఠినమైన శిక్షణ నేర్పించడం జరిగిందని ఈ శిక్షణలో ప్రతి అంశంలో మహాభావం విన్యాసాలు ముద్రలు రంగ ప్రవేశం గజ్జ వాదం కామాక్షి సుత్తి శబ్దం అష్టపది శివ సుత్తి మరకత మనీ మాయ కూచిపూడి లో ప్రత్యేక లక్షణమైన ఇత్తడి పందెం మీద చేసే నృత్యం ఎంతో రమంగా సాగిందని అన్నారు ప్రియాంక కూచిపూడి రాబోయే రోజులలో ఎంతో ఉన్నతమైన శిఖరాలకు వెళుతుందని చెప్పారు కూచిపూడి భరతనాట్యం వంటి నృత్యం హిందూ సంప్రదాయాలకు ఒక ప్రత్యేకత అని చెప్పారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ వేదాంత రాదేశం శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు శ్రీమతి రాధా శ్రీ రామభట్ల నరసింహ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

**దశ, రంగారెడ్డి :** లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్షకు సంబంధించి ఆదివారం శంషాబాద్ పాలమాకులలోని PMSHRI తెలంగాణ మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి,అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా,పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు.ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్షకు 403 మంది అభ్యర్థులకు గాను 329 మంది హాజరయ్యారని, 74 మంది గైర్హాజరయ్యారు.అదనపు కలెక్టర్ వెంట జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి కే.శ్రీనివాస్,రాజేంద్రనగర్ RDO వెంకట్ రెడ్డి,తహసీల్దార్ దత్,తదితరులు ఉన్నారు.అదే విధంగా బాలాపూర్ మండలం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏవో సునీల్ లు తనిఖీ చేశారు. వీరి వెంట మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఉన్నారు.ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 111 అభ్యర్థులకు గాను 101 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరయ్యారు.

## అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత

**దశ, ఎల్లారెడ్డిపేట:** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా కోరుట్లపేట గ్రామం నుండి బొప్పాపూర్ గ్రామం వైపు మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ ను పట్టుకొని విచారించగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్ ను పట్టుకొని ,టిప్పర్ ను,డ్రైవర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ ఐ మాలోతు మోతిరామ్ తెలిపారు.




ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేట గ్రామం నుండి బొప్పాపూర్ గ్రామం వైపు మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ లారీని ఆపి డ్రైవర్ ను విచారించగా తన పేరు హరాలే వినోద్ ఎల్లారెడ్డిపేటకు చెందిన వ్యక్తిని అని తెలిపాడని ఎస్ ఐ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం లోని రాజన్నపేట కు చెందిన టిప్పర్ యజమాని ఉడుగుల సురేందర్ ఆదేశాలతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు టిప్పర్ డ్రైవర్ హెరాలే వినోద్ తెలిపాడని,టిప్పర్ డ్రైవర్ తెలిపిన వివరాలతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ ను,టిప్పర్ డ్రైవర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి టిప్పర్ యజమాని ఉడుగుల సురేందర్ పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ ఐ మాలోతు తుకారాం తెలిపారు.